క్లుప్తంగా

14న దామోదరం సంజీవయ్య జయంతి

కాకినాడ సిటీ: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఈ నెల 14వ తేదీన కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్రానికి చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దామోదర సంజీవయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదేశించిందని కలెక్టర్ షణ్మోహన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా పార్వతీ, పరమేశ్వరుల సంబరం

కరప: మండలం గొర్రిపూడిలోని బసవేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి పార్వతీ, పరమేశ్వరుల సంబరాన్ని కరికాల భక్తులు ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మాఘ పౌర్ణమి సందర్భంగా బసవేశ్వరస్వామిని అర్చకులు బాదంపూడి వీర వెంకటసత్యనారాయణ శర్మ, శివకుమార్‌శర్మ ప్రత్యేకంగా అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నిప్పుల గుండాన్ని కొందరు భక్తులు తొక్కారు. ఆలయ ధర్మకర్త చప్పిడి నవీన్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఏటీఎంలను సక్రమంగా నిర్వహించాలి

కాకినాడ సిటీ: కాకినాడ కలెక్టర్ కార్యాలయం నుంచి చీడిగ గ్రామం వరకు ఉన్న మూడు ఎస్‌బీఐ ఏటీఎంలను సక్రమంగా నిర్వహించాలని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్‌ను సీపీఎం బృందం కలిసి బుధవారం వినతి పత్రం అందజేసింది. పది రోజులుగా ఈ ప్రాంతాల్లోని ఏటీఎంలలో నగదు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. నిర్వహణ తీరు, రక్షణ, ఏసీల పని తీరు సరిగా లేవన్నారు. దీనికి జీఎం బదులిస్తూ నగదు కొరత వాస్తమేనని, క్యాష్ లోడింగ్ చేసే సంస్థతో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని సరి చేసి మరొక ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించనున్నామన్నారు. సమస్య పరిష్కారానికి కొంత సమయం పడుతుందన్నారు. క్యాష్ లేని ఏటీఎంలను డోర్ లాక్ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల నిమిత్తం కాకినాడ డి-4సెక్షన్ సర్పవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఈఈ ఉదయ్ భాస్కర్ తెలియజేశారు. ఏపీఎస్పీ ఫీడర్ పరిధిలో ఈశ్వర్‌నగర్, బాలాజీనగర్, ఆంజనేయనగర్, ఏపీఎస్పీ ఏరియా, రాయుడుపాలెం, శేషాద్రినగర్, రాజీవ్‌నగర్, ఎస్ఆర్ఎంటీ, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డెయిరీ ఫారం సబ్ స్టేషన్ పరిధిలో..

కాకినాడ సిటీ: స్థానిక డెయిరీ ఫారం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఉప కేంద్రం, యార్డులో పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇండస్ట్రియల్ ఫీడర్, చిట్టినాడ్ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గృహ కల్ప, పావురాల తూము, దుమ్ములపేట, పోర్టు ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి కాకినాడ విద్యుత్ శాఖకు సహకరించాలని ఈఈ కోరారు.

'భోజన' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూలు ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ నర్ల ఈశ్వరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ధరలకు అనుగుణంగా విద్యార్థి మెనూ చార్జీని రూ.20కి పెంచాలని, పాఠశాలల్లోని పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుద్యోగులపై స్థానిక నాయకుల పెత్తనం పెరిగి రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, తమ కార్యకర్తలను నియమించుకునేందుకు పని చేస్తున్న కార్మికులను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో స్కూల్ ఆయాలు కొప్పిశెట్టి కుమారి, సునీత, మేడిశెట్టి దేవి, పి పద్మ పాల్గొన్నారు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బుధవారం కోర్టులో హాజరుపర్చగా 11 మందికి మూడు రోజుల జైలు, 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

e నేరానికి ఓ లెక్కుంది..!

- నగర వాసులే లక్ష్యంగా సైబర్ దాడులు
- మొబైల్ వినియోగమే వారికి వేదిక
- అజాగ్రత్త వల్లే నేరాలు
- అవగాహన ఉంటేనే అడ్డుకట్ట



జేఎన్‌టీయూలో సైబర్ నేరాల అవగాహనపై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

కాకినాడ క్రైం: నగర వాసులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో సైబర్ నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నగరమే వారి లక్ష్యం ఎందుకవుతోందన్న ప్రశ్నలపై నిపుణులు లోతైన శోధన చేస్తున్నారు. అందుకు పలు కారణాలు వెల్లడిస్తూనే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు.

- కాకినాడ మెయిన్ రోడ్‌లో ఓ వ్యాపారి తాజాగా సైబర్ మోసగాళ్ల బారిన పడ్డాడు. టెలిగ్రాం యాప్ ద్వారా వలపన్నిన మోసగాళ్లు యాడ్‌లు సందర్శించి డబ్బు సంపాదించొచ్చని నమ్మబలికారు. నమ్మేలా రూ.500 పెట్టుబడికి రూ.2 వేలు తిరిగి జమచేశారు. రూ.50 వేలు ఖాతాకు వేయమని నాలుగు రెట్లు అదనంగా ఇస్తామని నమ్మించి డబ్బు వేసిన వెంటనే మాయమయ్యారు.
- కాకినాడ ప్రతాప్ నగర్‌కు చెందిన ఓ పెద్దాయన బ్యాంకు ఖాతాపై సైబర్ నేరగాళ్లు కన్నువేశారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఖాతాకు కన్నం పెట్టాలనుకున్నారు. తేరుకున్న ఆయన అప్రమత్తమై తన ఖాతాలో ఉన్న రూ.కోటి మొత్తాన్ని కాపాడుకున్నాడు.
- కాకినాడ ఏటిమొగకు చెందిన ఓ అంగన్వాడీ టీచర్ ఖాతా నుంచి రెండు దఫాలలో రూ.50 వేలు చొప్పున మొత్తం రూ.లక్ష సొత్తు మాయమైంది. ఆధార్ అథెంటికేషన్ పేరుతో ఈ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు కొట్టేశారని నిర్ధారణ అయింది.

ఇలాంటి ఉదంతాలు ఎన్నెన్నో. ప్రత్యేకించి నగర పరిధిలోనే చోటు చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తోంది. నామమాత్రానికి ఫిర్యాదు చేసినా ఆ ఫిర్యాదు వల్ల బాధితులకు ఎటువంటి సాంత్వన చేకూరడం లేదు. పోయిన డబ్బు, నేరానికి పాల్పడ్డ నేరగాళ్లు పట్టుబడడం లేదు.

నగరమే టార్గెట్ ఎందుకు?

- నగరాల్లో ఇంటర్నెట్ వినియోగం ఎక్కువగా ఉండడం నేరగాళ్లకు కలిసివచ్చే అంశం. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు ఇతర టచ్ ప్యానెల్స్ మోసాలు చేసేందుకు ఓ వేదిక.
- ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు సైతం నగరాల్లోనే ఎక్కువ. డిజిటల్ పేమెంట్లు, క్రెడిట్ కార్డులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వినియోగం అధికం. ఇవే మోసాలకు ఆస్కారం.
- అర్బన్ ప్రాంతాల్లో జన సాంద్రత ఎక్కువగా ఉండడం వల్ల నేరాలకు ఎక్కువ అవకాశాలుంటాయి. ఇదే నేరగాళ్ల ప్రాథమిక సూత్రం.
- సైబర్ నేరగాళ్లు నేరుగా దాడి చేయరు. మాధ్యమాలు, మధ్యవర్తులే వారి వేదికలు. కొద్ది రోజుల క్రితం గాంధీనగర్‌లో ఆధార్ సెంటర్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తి కేంద్రంగా ఆధార్ అనుసంధాన ప్రక్రియను వినియోగించుకుని డబ్బు దోచేశారు. నగర ప్రాంతాల్లో ఇటువంటి మధ్యవర్తులు అనేకమంది దొరుకుతారు. నేరం బయటపడినా పట్టుబడడం అసాధ్యం. మరింత పరిశీలిస్తే మధ్యవర్తే పట్టుబడతాడు. అతడికి కూడా అసలు నేరస్తుడి కోసం తెలిసే అవకాశాలు చాలా తక్కువ. దీంతో తమ ఉనికికి ఎటువంటి ఇబ్బందీ లేదు.
- ఐటీపై పూర్తి స్థాయిలో పట్టున్నవారు, నిష్ణాతులు సైబర్ నేరాలలో అసలు దొంగలు. ఇటువంటి వారి ఉనికి నగరాల్లోనే ఎక్కువ. మొబైల్ హ్యాకింగ్, ఫిషింగ్, డార్క్ వెబ్ క్రిమినల్ యాక్టివిటీస్‌లో వీరు ఆరితేరి ఉంటారు.
- అడ్రస్ లేని కాల్ సెంటర్లు, ఫేక్ కంపెనీలు వేదికగా సైబర్ మోసాలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. వీటిని ఏర్పాటు చేసేందుకు నగర శివార్లను ఎంచుకుంటున్నారన్నారు. పొరుగు దేశాలు, రాష్ట్రాలలో ఉంటున్న నేరగాళ్ల స్థానిక విద్యావంతులను లక్ష్యంగా చేసుకుని తమ పన్నాగాలకు పదును పెడుతున్నారు. స్థానికులు కావడంతో వీరిని నమ్మి అనేక మంది సైబర్ మోసాలకు గురవుతున్నారు. డిజిటల్ అరెస్టు, మీరు లాటరీ గెలుచుకున్నారు, మీ బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అవబోతోంది, మీ మొబైల్‌కి వచ్చిన ఓటీపీ చెప్పండి వంటి కుయుక్తులన్నీ ఈ కోవకే చెందుతాయని అంటున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో ఇలా..

సైబర్ నేరగాళ్లకు గ్రామీణ ప్రాంతాలూ మినహాయింపు కాదు. కానీ నగర ప్రాంతాల్లో జరిగేంతలా కాకపోయినా అక్కడ సాంకేతికత వినియోగం ఎక్కువయ్యే కొద్దీ నేరాలూ పెరుగుతాయని పోలీస్ ఐటీ కోర్ విభాగం వెల్లడించింది.

కాకినాడ నగరంలోనే అధికం

ఏడాది కాలంలో కాకినాడ నగర పరిధి, అనుబంధ పరిసర ప్రాంతాల్లో చోటు చేసుకున్న సైబర్ నేరాలు అక్షరాలా 1447. కాకినాడ పోలీస్ డివిజన్ పరిధిలోని ఐదు గ్రామీణ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులు 290 మాత్రమే. ఇది కాకినాడ అర్బన్ పరిధితో పాటు పాక్షికంగా అర్బన్ ప్రాంతాల పరిధి కలిగి ఉన్న మొత్తం ఆరు పోలీస్‌స్టేషన్లలో గణాంకాలు. 2024-25 ఏడాది వ్యవధిలో స్టేషన్ల వారీ సైబర్ నేరాలలో నమోదైన గణాంకాలివీ....

పోలీసు పరిధి	కేసులు	డివిజన్ పోలీసు పరిధి	కేసులు
వన్ టౌన్	213		
టూ టౌన్	432	కోరింగ	76
త్రీ టౌన్	95	కరప	59
పోర్టు	42	పెదపూడి	53
సర్పవరం	468	గొల్లపాలెం	49
ఇంద్రపాలెం	197	తిమ్మాపురం	53

నగర పరిధిలో మొత్తం 1447 కేసులు నమోదు కాగా, ఈ నేరాల్లో బాధితులు కోల్పోయిన మొత్తం రూ.15,54,39,916. అలాగే డివిజన్ పరిధిలో మొత్తం 290 కేసులు నమోదు కాగా, ఈ నేరాల్లో బాధితులు కోల్పోయిన మొత్తం రూ. 2,44,69,320

ప్రత్యేక సైబర్ క్రైం విభాగం



కాకినాడ నగరంతో పాటు అర్బన్ పరిధిలో సైబర్ నేరాలు ఎక్కువగా చోటు చేసుకోవడం నిజమే. ఇందుకు ప్రధాన కారణం సాంకేతికత వినియోగంతో పాటు జాగ్రత్తలపై అవగాహన లేకపోవడం. కాకినాడలో ప్రత్యేక సైబర్ క్రైం విభాగం ఉంది. పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా మరింత బలోపేతం చేస్తున్నాం. వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) వినియోగించి చేస్తున్న కాల్స్‌ను ట్రేస్ చేయడం అంత సులభం కాదు. నిమిషాల వ్యవధిలోనే రెండు మూడు దేశాల లొకేషన్లు చూపుతుంది. ఛేదించే సాంకేతికత సిద్ధమవుతోంది. నగర పరిధిలో పూర్తి స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులతో సహా సామాన్య ప్రజానీకాన్ని చైతన్యవంతుల్ని చేస్తున్నాం. సత్ఫలితాలు వస్తున్నాయి. సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930, 112 లేదా ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ 94407 96515ను సంప్రదించాలి.

– గరికపాటి బిందుమాధవ్,
ఎస్పీ, కాకినాడ జిల్లా

సమన్వయంతో పరీక్షలు నిర్వహించండి

- డీఆర్వో వెంకటరావు
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: వచ్చే నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో సజావుగా జరిగేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రెగ్యులర్ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలతో పాటు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై ఆయన రెవెన్యూ, పాఠశాల విద్య, ఓపెన్ స్కూల్ సొసైటీ, పోస్టల్, జిల్లా పరిషత్, పోలీస్, ట్రెజరీ, రవాణా, విద్యుత్, వైద్య, ఆరోగ్యం, ఆర్టీసీ, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. పరీక్షా కేంద్రాలు, పరీక్ష పత్రాల స్టోరేజీ పాయింట్లు, పోలీస్ బందోబస్తు, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. పదో తరగతికి సంబంధించి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 142 పరీక్ష కేంద్రాల్లో 28,963 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ప్రశ్న పత్రాలు స్టోరేజీకి 25 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం పదో తరగతి (ఓపెన్ ఎస్ఎస్‌సి) పరీక్షలు, మార్చి 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతాయని డీఆర్వో వివరించారు. ఈ పరీక్షలనీ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. రెగ్యులర్ పదో తరగతి పరీక్షలతో పాటు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఉదయం పూట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 8873 మంది విద్యార్థులకు 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ జేఎస్‌వీ భాస్కరరావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, డిప్యూటీ జెడ్పీ సీఈవో రామ్మోహన్, డీటీసీ కె.శ్రీధర్, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వి.రాజశేఖర్, పోస్టల్ పీఆర్ఐపీ కె.ప్రసాద్, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి పి.సాయి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి, శ్రద్ధలతో చక్రస్నానం



సూర్యారావుపేట బీచ్‌లో మాఘ పౌర్ణమి స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రస్నానం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో చెరువు వద్దకు తీసుకు వెళ్లి పూజాదికాల అనంతరం చక్రస్నానం చేయించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చోర సంవాదం (దొంగల తోపు) జరిపారు. యండమూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవదాయ శాఖ ఈఓ ఏఆర్వీ అపర్ణ, కె.రఘు, గ్రామ పెద్దలతో కలసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పౌర్ణమి స్నానాలకు పోటెత్తిన భక్తులు

కాకినాడ రూరల్: మాఘ పౌర్ణమి స్నానాలకు సూర్యారావుపేట బీచ్‌కు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి పుణ్య స్నానాలు ఆచరించి సూర్య నమస్కారాలు చేసుకున్నారు. కాకినాడ, రూరల్ మండల గ్రామాలతో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వీరభద్రుని గద్దెలతో కాకినాడకు చెందిన భక్తులు మూడు లారీలలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు.

జగన్నాథపురంలో..

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చూర్ణోత్సవం, చక్రతీర్థం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో సత్యవేణి ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా 13న పుష్పయాగం, 14న తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ భావన బుధవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. మెయిన్ రోడ్డులోని టౌన్ హాల్, రామాలయం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అనంతరం వెహికల్ యార్డుకు వెళ్లి వాహనాలను పరిశీలించారు. ఆమె వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- పంటభూములను పరిశీలించిన జేడీఏ విజయ్‌కుమార్
- ఎగువ, దిగువ ప్రాంతాల రైతులు సహకరించుకోవాలని హితవు



వేములవాడలో ఇరిగేషన్, వ్యవసాయశాఖాధికారులు, రైతులతో కలసి ఆరిపోయిన పంట పొలాన్ని పరిశీలిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

కరప: మండలం వేములవాడ, పెద్దాపురప్పాడు గ్రామాల్లో బుధవారం జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు (జేడీఏ) ఎస్.విజయ్‌కుమార్ నీటి పారుదల, వ్యవసాయ శాఖాధికారులతో పంట పొలాలను పరిశీలించి, సాగునీటి సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి ఎద్దడితో ఎండుతున్న వరి చేల పరిస్థితిపై ×సాక్షి¤లో ×నేల తడారి.. చేలు ఎడారి¤ శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి స్పందించి ఎంఏఓ ఏవీ రాజేష్‌తో కలసి ఆయన విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల్లో పర్యటించిన విషయం పాఠకులకు విదితమే. అలాగే ×బీడు వరితున్న రబీ¤ శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి సైతం ఆయన స్పందించి వేములవాడలోని శివారు భూములను పరిశీలించారు. మూడు ఎత్తిపోతల పథకాలున్నా శివారు భూములకు నీటిని తోడటానికి సరిపోవడం లేదని, మరో నాలుగు విద్యుత్ మోటార్లు వేయించాలని నీటి సంఘం డైరెక్టర్ మీసాల రాంబాబు ఆ ప్రాంత రైతులు తమ సమస్యను వివరించారు. ఇరిగేషన్ ఏఈఈ నాగిరెడ్డి నాగభవాని మాట్లాడుతూ వంతుల వారీ విధానంలో నీటిని సరఫరా చేస్తున్నామని, దిగువ ఉన్న రైతులకు టర్న్ ఐదు రోజులైనా ఒక రోజు అదనంగా ఇస్తున్నామన్నారు. తుల్యభాగ డ్రెయిన్ నుంచి నీటిని తోడడానికి ఆయిల్ ఇంజిన్లకు ప్రతిపాదనలు ఇస్తామన్నారు. విద్యుత్ మోటార్లు అయితే రాజమహేంద్రవరం ఎత్తిపోతల పథకం అధికారుల పరిధిలో ఉంటుందన్నారు. వంతు వచ్చినప్పుడు రైతులు కూడా ఎగువ, దిగువ ప్రాంతాల వారు ఒకరికొకరు సహకరించుకోవాలని, సాగునీరు దిగువకు వస్తున్నప్పుడు ఎగువ ప్రాంతం వారు ఇంజిన్లతో తోడకుండా చూసుకోవాలని ఏఈఈ భవాని సూచించారు. ఆయిల్ ఇంజిన్లకు ప్రతిపాదనలు తీసుకుని, కలెక్టర్ షణ్మోహన్‌కు సమస్యను వివరించి మంజూరు చేయిస్తామని రైతులకు జేడీఏ హామీ ఇచ్చారు. తర్వాత అధికారులు పెద్దాపురప్పాడులో పర్యటించగా వెల్ల నార్త్ కెనాల్ నుంచి తక్కువ స్థాయిలో నీటిని వదులుతున్నారని, దీంతో శివారు భూములకు సాగునీరు అందడం లేదని నీటిసంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు జేడీఏకు వివరించారు. జేడీఏ విజయ్‌కుమార్ స్పందించి పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం గ్రామాలకు వంతు వచ్చినప్పుడు నీటి స్థాయిని పెంచి, సాగునీటిని పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని జగన్నాథగిరి సెక్షన్ ఏఈఈ జి.ప్రవీణ్‌కు సూచించారు. కాలువ పూడిక తీత పనులు జరుగుతున్నాయని, వచ్చే టర్న్‌లో నీటి మట్టం పెంచుతామని ఏఈఈ తెలిపారు. రబీలో సాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని జేడీఏ విజయ్‌కుమార్ రైతులకు తెలిపారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, వీఏఏ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలిగా శివప్రసన్న



శివప్రసన్నను అభినందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలిగా మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఈ నియామకాన్ని ప్రకటించింది. 2022 నుంచి ఆమె వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. రెండోసారి ఆమెను ఈ పదవిలో కొనసాగిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ఆమె వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అండగా పోరాడతానన్నారు. ఆమెను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

పీడీఎఫ్ ఎప్పుడూ ప్రజాపక్షమే

- హర్షకుమార్ వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ ఐవీ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

కాకినాడ సిటీ: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పీడీఎఫ్, యూటీఎఫ్‌ను విమర్శిస్తూ మాజీ ఎంపీ హర్షకుమార్ చేసిన వ్యాఖ్యలను ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) తీవ్రంగా ఖండించారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ హోంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీడీఎఫ్ ఎప్పుడూ ప్రజా పక్షమేనని, యూటీఎఫ్‌తో పాటు తాము అధికార కూటమికి అమ్ముడుపోయామని ఆధారాలు లేని ఆరోపణలు చేయడం తగదన్నారు. నామినేషన్ ప్రక్రియ ఎన్నికల నిబంధనల ప్రకారమే జరిగిందన్నారు. ఇతర అభ్యర్థుల సమక్షంలోనే డీవీ రాఘవులు నామినేషన్‌ను ఆరో ఆమోదించారన్నారు. కులం ముద్రలు పుట్టుకతో అందరికీ ఉండవచ్చు కాని పీడీఎఫ్‌కి కుల పరమైన అభ్యర్థుల ఎంపిక గాని, కుల పరంగా ఓట్లు అభ్యర్థించడం గాని చేయదని ఐవీ స్పష్టం చేశారు. డీవీ రాఘవులు 40 ఏళ్లగా ఉపాధ్యాయ ఉద్యమంలో ఉన్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, పెన్షనర్లు, వివిధ ప్రజా సంఘాల ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని వివరించారు. హర్షకుమార్ తన అభ్యర్థి గుణగణాలు, అర్హతలు ప్రజలకు చెప్పి ఓట్లు అడిగితే బావుంటుందన్నారు. పీడీఎఫ్ అభ్యర్థిపై హర్షకుమార్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఐవీ హితవు పలికారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయాలి

- ఆర్డీఓ మల్లిబాబు



కరపలో రైతు రిజిస్ట్రీ, రీసర్వేలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ మల్లిబాబు

కరప: రైతు సేవా కేంద్రాలలో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చేందుకు రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేపట్టాలని ఆర్డీఓ మల్లిబాబు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించి, అనుసరించాల్సిన విధి విధానాలపై సూచనలిచ్చారు. భూమి గల ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రైతులకు ఇచ్చే విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారానే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. రైతులకు వివరించి, ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వే గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాల పట్టాల తనిఖీ తదితర రెవెన్యూ శాఖ పనులపై ఆర్డీఓ సమీక్షించారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంఏఓ ఏవీ రాజేష్, ఆర్ఐ పవన్ తదితరులు పాల్గొన్నారు.

సైనికాధికారి అదృశ్యంపై విచారణ

కాకినాడ క్రైం: కేరళకు చెందిన ఓ సైనికాధికారి మృతదేహాన్ని గుర్తించేందుకు ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు బుధవారం కాకినాడకు వచ్చి విచారణ నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. కేరళ రాష్ట్రం పతనంతిట్ట జిల్లా కోడుమాన్ నగరానికి చెందిన శంకరన్.కె భారత సైన్యంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎస్సై స్థాయి అధికారి. 2023 ఆగస్టు 22న సైన్యం నుంచి సెలవుపై ఇంటికి వచ్చి, మరో 37 రోజుల సెలవు పెంచుకునేందుకు అక్టోబర్ 19న తిరిగి అరుణాచల్‌ప్రదేశ్ వెళ్లారు. అస్సాంలో గౌహతి ఎక్స్‌ప్రెస్‌లో నవంబర్ 25న తిరిగి కేరళకు ప్రయాణమయ్యారు. ఈ విషయాన్ని అతడితో పాటు కార్యాలయ అధికారులు కుటుంబానికి నిర్ధారించారు. అదే నెల 27న చెన్నై రైల్వే స్టేషన్ నుంచి శంకరన్ భార్య కుమారికి ఓ వ్యక్తి లగేజ్ బ్యాగ్ చెన్నై రైల్వే స్టేషన్ సమీపంలో పడిపోయిందని ఓ కాల్ వచ్చింది. అదే రోజు రాత్రి సామర్లకోట స్టేషన్‌లో రైలు నుంచి జారిపడి శంకరన్ మృతి చెందారు. ఈ విషయాన్ని 28న ఉదయం గుర్తించిన రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మూడు రోజులు కాకినాడ మార్చురీలో ఉంచి ఆయన ఆచూకీ కోసం ప్రయత్నించి ఏమీ దొరకకపోవడంతో నిబంధనల మేరకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విజ్జపురెడ్డి శ్మశాన వాటికలో పూడ్చి పెట్టారు. ఇదిలా ఉంటే, తన తండ్రి జాడ కానరాలేదని కుమారుడు శ్రీజిత్ శంకరన్ అక్కడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించి కాలం గడపడంతో ఆయన పోలీసుల తీరుపై అక్కడి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు కేసును సీబీఐ తీసుకుని విచారణలో భాగంగా శంకరన్ తప్పిపోయిన తేదీ, సామర్లకోట రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతి చెందిన తేదీ సరిపోలడంతో బుధవారం కాకినాడ వచ్చి విచారణ జరిపారు. ఇద్దరు ట్రైనీ ఐపీఎస్‌లు, సామర్లకోట రైల్వే ఎస్ఐ వి.వాసు, ఫోరెన్సిక్ నిపుణులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఫణికిరణ్ పరిశీలనలో కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర సమక్షంలో శ్మశాన వాటికలో తవ్వకాలు చేపట్టినప్పటికీ అక్కడ ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని చుట్టిన కవర్ కానీ, మృతదేహం కానీ డీకంపోజ్ అయి మట్టిలో కలిసిపోయాయని వైద్యులు నిర్ధారించడంతో సీబీఐ అధికారులు ఆ మేరకు నమోదు చేసుకుని వెనుదిరిగారు. కాగా మృతదేహాన్ని పూడ్చేటపుడు దానికి చుట్టిన పసుపు, ఎరుపు రంగు కవర్‌ను, అందులోని మృతదేహం ఫొటోను శంకరన్ కుటుంబ సభ్యులకు చూపగా వారు ఆయనను గుర్తించినట్టు సమాచారం.